AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

16-2-2026 (Monday) MAIN EDITION

## ఏపీకి బిల్‌గేట్స్.. ఘన స్వాగతం పలికిన మంత్రులు




**అక్షరటుడే, ఏపీ:** ప్రపంచ కుబేరుడు, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. సీయోల్ సౌత్ కొరియన్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. గన్నవరంలో బిల్‌గేట్స్‌కు మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, పలువురు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో అమరావతికి వెళ్లారు. సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. అనంతరం సీఎం చంద్రబాబు నివాసం సమీపంలో ఉన్న సంజీవని ప్రాజెక్టుకు చేరుకుని అరటి రైతులతో బిల్ గేట్స్ సమావేశం అయ్యారు.

## కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరికి ప్రివిలేజ్ నోటీసులు



**అక్షరటుడే, ఢిల్లీ:** రాజ్యసభ సభ్యురాలు, కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరికి సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు జారీ అయ్యాయి. ఈనెల 23లోగా వివరణ ఇవ్వాలని ప్రివిలేజ్ కమిటీ ఆదేశించింది. ఎంపీ రేణుకా చౌదరి శీతాకాల సమావేశాల్లో కుక్కను కారులో పార్లమెంటుకు తీసుకొచ్చారు. కుక్కను తీసుకురావడంపై పలువురు ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. రేణుకా చౌదరి మాట్లాడుతూ.. లోపల కూర్చున్నవారే కరుస్తారని, కుక్కలు కరవవని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆమెపై బీజేపీ ఎంపీలు బ్రిజ్లాల్, ఇందు బాలగోస్వామి ఫిర్యాదు చేశారు.

## 18 నుంచి యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు



**అక్షరటుడే, యాదాద్రి:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 18న ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు 28 వరకు జరగనున్నాయి. 18న స్వస్తివాచనంతో ప్రారంభమై 28న రాత్రి డోలోత్సవంతో ముగియనున్నాయని ఆలయ ఈవో వెల్లడించారు. 24న రాత్రి ఎదుర్కోలు, 25న రాత్రి తిరుకళ్యాణ మహోత్సవం జరగనున్నాయన్నారు.

## తగ్గిన బంగారం ధరలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు క్రమంగా కొనసాగుతున్నాయి. నేడు బంగారం ధర స్వల్పంగా తగ్గింది. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,310 తగ్గి రూ.1,56,440వద్ద కొనసాగుతోంది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,200 తగ్గి రూ.1,43,400గా ఉంది.

## గ్యాస్ సిలిండర్లు లీకై ఆరుగురికి అస్వస్థత



**అక్షరటుడే, ఏపీ:** గ్యాస్ సిలిండర్లు లీకై ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం అంపావల్లి తాగునీటి పథకంలో గ్యాస్ సిలిండర్లు లీకయ్యాయి. దీంతో సమీపంలోని ఇళ్లలో నివాసం ఉంటున్న ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై మంత్రి అచ్చెంనాయుడు ఆరా తీశారు.

# వీడిన ఉత్కంఠ



**మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన మేయర్, ఛైర్‌పర్సన్ ఎన్నిక సోమవారం ముగిసింది. దీంతో ఉత్కంఠకు తెరపడింది. ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత.. మేయర్, ఛైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో ఎన్నిక ఉత్కంఠగా సాగింది. పలు చోట్ల బీఆర్ఎస్, బీజేపీ, మరికొన్ని ప్రాంతాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటి కావడం గమనార్హం.**

**– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

- **మేయర్, ఛైర్‌పర్సన్ల ఎన్నిక పూర్తి**
- **పలు చోట్ల ఉద్రిక్తత**
- **కరీంనగర్‌లో కమలం పాగా**
- **ఐదు కార్పొరేషన్లపై కాంగ్రెస్ జెండా**
- **కొత్తగూడెంను దక్కించుకున్న సీపీఐ**

మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికల సందర్భంగా పలు చోట్ల ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాష్ట్రంలో మొత్తం 34 మున్సిపాలిటీల్లో హంగ్ వచ్చిన విషయం తెలిసిందే. హంగ్ వచ్చిన పలు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. తొర్రూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యాకర్తలు పరసర్పం దాడులు చేసుకున్నారు. మరోవైపు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును పోలీసులు నిర్భందించారు. హంగ్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ నేతలు చక్రం తిప్పారు. ఇతర పార్టీల మద్దతుతో ఛైర్‌పర్సన్ పీఠాలను కైవసం చేసుకున్నారు.

### కార్యాలయంపై దాడి

ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఓ అభ్యర్థి కనిపించకుండా పోవడంతో ఆయన అనుచరులు మున్సిపల్ కార్యాలయంపై దాడి చేశారు. అద్దాలు పగులకొట్టారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ పత్య నాయక్ అమ్ముడు పోయాడు అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఛైర్మన్ పీఠం దక్కకుండా కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించేశారు.

### చిత్ర విచిత్రాలు..

మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటు చేసుకున్నాయి. నిత్యం విమర్శలు చేసుకునే బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పలు చోట్ల జత కట్టాయి. మేడ్చల్ జిల్లా అలియాబాద్‌లో బీజేపీ మద్దతుతో కాంగ్రెస్ ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. మరోవైపు కామారెడ్డిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై ఛైర్‌పర్సన్, డిప్యూటీ ఛైర్‌పర్సన్ పదవులను దక్కించుకున్నాయి. మరోవైపు కొన్నిచోట్ల బీఆర్ఎస్, బీజేపీ కలిసిపోయాయి. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు తెలిపింది.

### ఒకే కారులో వచ్చి..

సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారోత్సవానికి ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరు అయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, బీజేపీ ఎంపీ ఒకే కారులో రావడ గమనార్హం. ఇక్కడ బీజేపీ ఒక్క స్థానంలో కూడా గెలవలేదు. అయినా కూడా ఎక్స్ అఫీషియో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎంపీ వచ్చారు. దీంతో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. బుల్లెట్ దిగిందా లేదా అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఐదు మున్సిపాలిటీలు బీఆర్ఎస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ క్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి బుల్లెట్ దిగిందా లేదా అంటూ ఆయన డైలాగ్ కొట్టారు.


### 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

రాష్ట్రంలోని 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. వివిధ కారణాలతో అధికారులు ఎన్నికను వాయిదా వేశారు. ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, కేతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూరులో ఎన్నిక నిలిచిపోయింది. ఇందులో కొన్ని మున్సిపాలిటీల్లో మంగళవారం ఎన్నిక నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

### కార్పొరేషన్ మేయర్లు వీరే..

కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్‌గా సీపీఐకి చెందిన మూడు గణేష్ ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి (కాంగ్రెస్) గెలిచారు. నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ (ఎంఐఎం) ఎన్నికయ్యారు. నల్గొండ మేయర్‌గా కాంగ్రెస్‌కు చెందిన బుర్రి చైతన్యరెడ్డి, మహ్మద్ అష్రఫ్ అలీ గెలుపొందారు. కరీంనగర్‌లో బీజేపీ పాగా వేసింది. మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావు ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్‌కు చెందిన మమత మేయర్‌గా, సురేందర్‌రెడ్డి డిప్యూటీ మేయర్‌గా.. మంచిర్యాలలో ధరణి మధుకర్ (కాంగ్రెస్) మేయర్‌గా ఎన్నికయ్యారు.

## ఏఐ సమ్మిట్‌లో పాల్గొనాలి : ప్రధాని మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఢిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ. ఈ సమిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. భారత యువత ప్రతిభ, సామర్థ్యం ప్రపంచానికి తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సైన్స్, టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందని తెలిపారు. మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ భారత్‌లో జరుగుతుండడం గర్వకారణమన్నారు.

## రైతులకు బోనస్ డబ్బులు విడుదల

**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణలో రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి పెండింగ్ బోనస్ బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల చేసింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించింది. అయితే కొంత మందికి బకాయిలు పెండింగ్‌లో పడ్డాయి. తాజాగా వారికి నిధులు విడుదల చేసింది. ఇప్పటి వరకు మొత్తం రూ.1939.58 కోట్లు బోనస్ చెల్లించింది.

## జాగృతిలో చేరిన మాజీ ఎమ్మెల్యే కుమారుడు



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ జాగృతిలో మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య కుమారుడు మనోహర్ చేరారు. కావేటి సమ్మయ్య సిర్పూర్ ఎమ్మెల్యేగా పని చేశారు. ఆయన కుమారుడు తన భార్య కావేటి సబితతో కలిసి సోమవారం జాగృతిలో చేరారు. వారికి కల్వకుంట్ల కవిత కండువా కప్పి ఆహ్వానించారు.

## నల్గొండ అభివృద్ధే లక్ష్యం : మంత్రి కోమటిరెడ్డి




**అక్షరటుడే, నల్గొండ :** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు తన కల అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆ కల సాకారమై, ఇవాళ అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేస్తుంటే తన మనసు గర్వంతో నిండిపోయిందన్నారు. నల్గొండను దేశం గర్వించేలా ఒక 'క్లీన్ గ్రీన్ స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. రాజకీయాలకు తావు లేకుండా, తాము ఓడిపోయిన డివిజన్లలో సైతం అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమం, ప్రతి వీధికి ఆధునిక వసతులు చేరడమే తన బాధ్యత అన్నారు. మేయర్‌గా ఎన్నికైన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

## నరబలి కలకలం

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని చైతన్యపురిలో నరబలి వార్తలు కలకలం రేపాయి. వైశ్యరాజు జ్యువెలర్స్ వాచ్‌మెన్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. ముత్తయ్య అనే వ్యక్తి కొంతకాలంగా వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. వైశ్యరాజు జ్యువెల్లర్స్ త్వరలో ప్రారంభించనున్నారు. షాప్ ఓపెనింగ్‌కు ముందు నరబలి ఇచ్చారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని పేర్కొన్నారు.

## రూ.కోటి విలువైన గంజాయి పట్టివేత



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లాలో రూ.కోటి విలువైన గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కొయ్యూరు మంప పీఎస్ పరిధిలో గంజాయి పట్టుకొని, నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 182 కేజీల గంజాయి, అశోక్ లేలాండ్ వాహనం, స్కూటీ, 4 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు.

## పనిలో ఉండటమే ఇష్టం..: శోభిత



**టాలీవుడ్, బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శోభిత. ఈ అమ్మడు ఇటీవల 'చీకటిలో' సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. 2018లో వచ్చిన 'గూఢచారి' తర్వాత గ్యాప్ తీసుకున్న ఈమె.. ఈ మధ్యలో పెద్ద పెద్ద ప్రాజెక్టులు చేసినా, మళ్లీ తన మాతృభాషలోనటించడం పట్ల ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఈ సినిమాలో ఆమె ఒక పాడ్‌కాస్టర్‌గా నటించగా, తెలుగులో క్లిష్టమైన పదాలను కూడా ఎంతో ఈజీగా పలకగలిగానని, భాష మీద పట్టు ఉండటం వల్ల ఆ షూటింగ్ అనుభవం చాలా సరదాగా సాగిపోయిందని చెప్పకొచ్చింది. ఇక ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో నటీనటుల గురించి నిరంతరం సోషల్ మీడియాలో చర్చ జరిగేలా చేసే పిఆర్ కల్చర్ గురించి శోభిత స్పందించింది.**

**– అక్షరటుడే, సినిమాడెస్క్**

## రాజస్థాన్‌లో అగ్ని ప్రమాదం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రాజస్థాన్‌లో భివాడీలోని ఓ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. సోమవారం తెల్లవారుజామున రసాయన ఫ్యాక్టరీలో మంటలు చెలరేగాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో సజీవదహనమైన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు కార్మికులు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది.

